# శిక్ష

మహారాజు కళ్లు అరుణవర్ణం దాల్చాయి.

తలచుకుంటున్న కొద్దీ శరీరం ఆవేశంతో ఎగిరెగిరిపడుతోంది.

ఇదంతా ఎలా సాధ్యం ?

అయినా తనకు అందిన సమాచారం ప్రకారం ఈ వార్త యదార్థమే.

ఓ మహా సామ్రాజ్యానికి తిరుగులేని నాయకుడు తను. అలాంటిది ఇలా జరగడం తన రాచరికానికే అవమానం.

ఆయన వెంటనే అమాత్యుల వారితో సమావేశం అయ్యాడు.

"ఇది మాకు తీరని అవమానం" అన్నాడు.

"నిజమే ప్రభూ- వాడ్ని మనం క్షమించకూడదు. మీరు అనుమతి ఇస్తే వెంటనే వాడ్ని ఉరితీయించే ఏర్పాట్లు చేస్తాను" బదులిచ్చాడు అమాత్యుడు.

"ముందు నేను వాడ్ని ఓసారి చూడాలి" అన్నాడు మహారాజు.

"వెంటనే అతన్ని బంధించి కారాగారంలో ఉంచుతాం మహారాజా" అంటూ అమాత్యులవారు నిష్క్రమించారు.

* * *

అమాత్యులవారితో కలసి మారువేషంలో మహారాజు బంధితుడైన ఆ యువకుడ్ని పరిశీలించాడు.

అతడు చాలా అందంగా ఉన్నాడు. అంతకుమించి అతని శరీర నిర్మాణం చాలా పొందికగా ఉంది.

తిరిగివస్తూ అన్నాడు మహారాజు.

"వీడు బలంగానే కనిపిస్తున్నాడు"

"చిత్తం ప్రభూ"

"అయినా వీడు ఇంత నేరానికి పాల్పడినాక బతికి ఉండుటకు అనర్హుడు"

"చిత్తం ప్రభూ. ఇంక కొరత వేయించ మందురా"

"మంత్రిగారూ.... కొరత వేయించిన ఒక్క క్షణములో వాడు మరణించును కదా"

"అవును ప్రభూ"

"వాడికి అంత సుఖ మరణం సంప్రాప్తించుట మాకు సమ్మతం కాదు. వాడి ఎర్రటి దేహమును చూసీ.... వాడి కండలు చూసే మా నెత్తురు ఉడికిపోవుచున్నది"

"అవును ప్రభూ. వాడు ఉషోదయమున లేచి వ్యాయామం చేస్తుంటాడు"

"అందుకే వాడికి దారుణ మరణం సంభవించవలెను"

"ఆజ్ఞ ఇవ్వండి మహా ప్రభూ. ముక్కలు ముక్కలుగా నరికించి కాకులకూ గద్దలకూ వేయించమందురా"

"వద్దు" గంభీరంగా అన్నాడు మహారాజు.

ఆయన ఆంతర్యం అర్థంకాక అమాత్యులవారు మౌనం వహించారు.

"వాడికి ఈరోజు నుండి ఎటువంటి ఆహారమూ ఇవ్వకండి. తిండి లేక కృంగి కృశించి ఎముకల గూడుగా మారి వాడు చావాలి. అప్పుడే నాకు ఆనందం" అన్నారు మహారాజు.

"చిత్తం మహాప్రభూ"

* * *

వేగులవారు అందించిన సమాచారం ప్రకారం.

యుక్తవయసు వచ్చిన మహారాజు కుమార్తె 'అఖిలాదేవి'కి ఈ రాజ్యంలోని ఓ నిరుపేద యువకునిపై అకస్మాత్తుగా మమకారం హెచ్చింది. అది ప్రణయమై అటు పిమ్మట ప్రళయమైపోవకముందే జాగ్రత్త వహించవలెను. అన్నదే ఆ వార్త.

మహారాజు ఈ వార్త వినినంతనే అగ్గిమీద గుగ్గిలం అయిపోయేరు. ఆయన తన కుమార్తెను పిలిచి ఇలా ఎందుకు చేశావని ప్రశ్నించలేదు. అసలు ఈ విషయం మూడో కంటికి తెలియకుండా ముగించాలనుకున్నాడు. అయితే తన కుమార్తెను అంతగా ఆకర్షించిన ఆ యువకుడిని ఓసారి చూడాలనిపించింది.

చూశాక మరింత ఆగ్రహం కలిగింది.

"ఔరా.... ఎంత చక్కటి అవయవ పొందిక... ఆ ముఖంలో ఎంతటి కళాకాంతులున్నాయి. మహారాజ కుటుంబాలకు పరిమితం కావలసిన ప్రత్యేకతలన్నీ ఈ యువకుడి దగ్గర ఉన్నాయి. ఏది ఏమైననూ నా కుమార్తెలో సౌందర్యం పట్ల గొప్ప అభిరుచి ఉంది" అని ఓ క్షణం తృప్తిచెందాడు.

అంతలోనే....

"అయినా రాచరికపు సాంప్రదాయాలను కాలరాయటానికి మేం అంగీకరించం గాక అంగీకరించం. అది మా రక్తం పంచుకు పుట్టినవారికైననూ, మరెవరికైననూ అంతే. ఇంకెంతకాలం.... కొన్నివారాల లోగా ఆ యువకుడు చిక్కి శల్యమై ఆకలిచావు చచ్చును. ఆకలితో కేకలు వేయుచూ 'అన్నమో రామచంద్రా' అనవలెను. ఇంక అప్పుడు ప్రేమ తలపునకు రాదు" అనుకున్నాడు.

ఆ రాత్రి మహారాజు సుఖంగా నిద్రించాడు.

* * *

"మహామంత్రీ"

"ప్రభూ"

"ఆ యువకునికి శిక్ష విధించి మూడు వారములు పైగా గడిచిందనుకుంటాను"

"అవును ప్రభూ"

"అతగాడు మరణించినట్లు వార్త వచ్చెనా ?"

"లేదు ప్రభూ"

"పోనీ స్పృహ తప్పినట్లు వర్తమానం..."

"ఇంకా అందలేదు ప్రభూ"

"మనం ఓసారి కారాగారమును సందర్శించవలెను"

అమాత్యులవారితో కలసి మహారాజు కారాగారంలోకి వెళ్ళసరికి ఆ యువకుడు ధ్యానం చేసుకుంటూ కనిపించాడు. కొద్దిగా గడ్డం పెరిగింది. మనిషి కొంచెం చిక్కినట్లుగా కనిపించాడు. అయితే అతనిలో మరింత తేజస్సు కనిపించింది. అతనిని అలా చూడగానే మహారాజు మరింతగా ఆగ్రహోదగ్రుడయ్యాడు.

"అమాత్యా... ఇది ఏమి ? వాడు మరింత ఆకర్షణీయముగా కనిపించుచున్నాడు"

"మహా ప్రభూ... ఇదివరకు ఎర్రటి ఎండలో తిరుగాడుచున్న వ్యక్తి నీడపట్టున ఉండంవలన ఆ దేహమునకు కాంతి వచ్చినది. అంతే"

"ఇన్ని రోజులుగా ఆహారం లేకపోయిననూ మనిషిలో ఏమాత్రం తేడా కనిపించడంలేదు. నాకు అనుమానంగా ఉన్నది"

"ఏ విషయంలో మహాప్రభూ"

"ఇక్కడి కాపలా సైనికులు అతనికి తినుబండారములు అందిస్తున్నారేమోనని"

"ప్రభూ... రెండు దినములలో మీకు పూర్తి నివేదికను అందించగలను" అన్నారు అమాత్యులవారు.

* * *

మహారాజు ముందు అమాత్యులవారు చేతులు కట్టుకొని నిలబడ్డారు.

"చెప్పండి" అన్నాడు మహారాజు.

"ప్రభూ మన కారాగార వ్యవహారముల మీద తీక్ష్ణంగా దర్యాప్తు జరిపించటం జరిగింది. అతనికి ఎవరూ తినుబండారములు అందించటం లేదు".

"మరి అది ఎలా సాధ్యం"

"ప్రభూ ఈ విషయం ఆస్థాన వైద్యుల వారిని సంప్రదించడం జరిగింది. ఆయన చెప్పిన దాని ప్రకారం మనిషి భోజనం చేయనవసరం లేదు. ఆయా పదార్థాలను చూసిన చాలును. తినినప్పుడు ఏ ప్రయోజన ములు కలుగునో చూసిననూ అంతే ప్రయోజనములు కలుగును"

"నిజమా?" ఆశ్చర్యపోతూ అన్నాడు.

"అవును ప్రభూ! ఇది ప్రత్యేక శక్తులు కలవారి విషయంలో సాధ్యమే"

"మరి తరుణోపాయం"

"ఆ విషయం గురించే ఆలోచించుచుంటిని ప్రభూ. కారాగార సైనికులు దినమంతయును అక్కడే ఉంటున్నారు. అందువలన తమతో పాటు తినుబండారములు తెచ్చుకొనుచున్నారు. వాటిని చూసీ, వాటి వాసనను పీల్చి ఆ యువకుడు ప్రయోజనం పొందుచున్నాడు"

"అటులైన కారాగారములో మన భటులకు తిండి నిషిద్ధం"

"ఆ విషయము నా ఆలోచనలో వున్నది. కానీ ప్రభూ తిండి లేకుండా వారందరూ ఏ విధముగా పనిచేయగలరు?"

"ధర్మ సంకటమే" అని అటూ ఇటూ పచార్లు చేశాడు మహారాజు...

"అమాత్యా... పిలిచాడు.

"ప్రభూ"

"కారాగారంలో సైనికుల సంఖ్యను పెంచండి. వంతుల వారీగా కాపలాలు ఏర్పాటు చేయండి, ఎటువంటి పరిస్థితులలోనూ అక్కడ ఎవరూ భోజనములు చేయకూడదు"

"అలాగే ప్రభూ"

అంతేకాదు నేను త్వరలోనే వాడి మరణవార్త వినవలెనని ఆరాట పడుతున్నాను"

"త్వరలోనే మనం వింటాం ప్రభూ"

* * *

"అమాత్యా"

"ప్రభూ"

"రెండు నెలల కాలం గడిచిపోయినది కదా. పరిస్థితి ఏమిటి ?

"ప్రభూ మీకు తెలియని దేముంది. మన సామంతరాజులు తిరుగు బాటు ప్రయత్నములు చేయుచున్నారని వేగుల నుండి వార్తలు అందు చున్నవి. అందువల్ల అతని గురించి విచారించుట కుదరలేదు. ప్రభూ బహుశా అతను తన తుది ఘడియలలో వుండి వుంటాడు. మనం ఓసారి చూసివద్దాం"

ఇద్దరూ వెళ్ళారు.

మనిషి మరింతగా చిక్కాడు. ఇదివరకటిలానే ధ్యానం చేసుకుంటూ ఉన్నాడు. మరింత కాంతివంతంగా కనిపించాడు.

మహారాజు గిరుక్కున వెనక్కి తిరిగాడు రోషంతో-

"అమాత్యా... ఇదేమి వైపరీత్యం ?"

"అదియే నాకూను బోధపడటం లేదు ప్రభూ"

"మనుషులు ఆహారంలేని ఎడల కృంగి కృశించి పోవుదురని విన్నాను. ఇదీ ఏమి నన్ను ఆశ్చర్య పరుచుచున్నది"

"అవును ప్రభూ చరిత్రతో ఇటువంటి సంఘటనలు కొన్ని విన్నాం. అతను 'ప్రేమ' భావంతో బతుకుతున్నాడంటారా ?

"అది ఎలా సాధ్యం ?"

"ప్రేమనే ధ్యానిస్తూ ఈ ప్రపంచమును జయించవచ్చునేమో"

"అది నేను విశ్వసించను. పూర్వం మనం విన్నవన్నీ కథలు మాత్రమే. భగవంతుడ్ని ధ్యానించిన వారికి శక్తులు రావటం కొంత వరకు ఆమోదించవచ్చు. అయితే ఇది మాత్రం నేను ఆమోదించలేను. ఇందులో ఏదో రహస్యం ఉన్నది. అది కనుక్కోండి"

"అలాగే ప్రభూ !

* * *

"ప్రభూ అన్నాడు అమాత్యులవారు మెల్లగా.

ఇటీవల కాలంలో మహారాజు వారిలో ఒకింతమార్పు గోచరిస్తోంది. అంతకు ముందు ఎక్కువగా రాజ్య విస్తరణా, ఇతర విషయాల గురించి ఆలోచిస్తుండేవారు. ఈ నడుమ ఆయనకు ఒకటే ధ్యాస. అంతకుమించి ఆయన తగ్గిపోతున్నాడు.

"చెప్పండి అమాత్యా" అన్నాడు నీరసంగా.

"ప్రభూ శారీరక ధర్మశాస్త్రములు ఓ వింతను పేర్కొంటున్నాయి.

"ఏమిటది అమాత్యా"

"మనం తినదలుచుకున్న పదార్థములను రుచి చూడనవసరం లేదు. ఆఘ్రాణించ నవసరంలేదు. కేవలం మనసును తలచినంతన చాలును"

"అదెటు అమాత్యా ?"

"ఉదాహరణకు మనం మాంసాహారమును స్వీకరించామనుకుందాం. అప్పుడు మనకు కొంత శక్తి లభిస్తుంది. అలా శక్తి లభించటానికి మన ఉదరంలో ఏర్పాట్లున్నాయి ప్రభూ. అలానే మనకు ఏదైనా పదార్థం గురించి తలచుకున్ననూ నోరు ఊరుతుంది. అనగా ఒక విషయం అర్థం అవుచున్నది కదా ప్రభూ మన ఎదుట పదార్థములు ఉండనవసరం లేదు. అటులనే ఆయువకుడు వివిధ ఫల, మాంసాహార, రాజ భోజనాల గురించి మనమును ఊహించుకుంటున్నాడు. ఉదరంనందు రసాయనిక చర్య జరిగి శక్తులు విడుదల అవుతున్నాయి.

"ఇది నాకు నమ్మశక్యంకాదు"

"కానీ మన కళ్ళముందున్న వాస్తవం అదీ ప్రభూ"

"అటులైన మానవ జాతికి ఈ ఆకలి దప్పులెందుకు? తిండికోసం ఈ ఆరాటం ఎందుకు ? పంటలు పండించుట ఎందుకు ? అందరూ ఎవరికి ఇష్టమైన పదార్థములను వారు తింటున్నట్లుగా ఊహించవచ్చును కదా" అన్నాడు మహారాజు.

"ఇందులో చిన్న రహస్యం ఉంది ప్రభూ. ఇలా చేయటం అందరికీ సాధ్యంకాదు. కొన్ని శక్తులున్న వారికి మాత్రమే అది సాధ్యం ఈ యువకునకు అటువంటి శక్తులున్నాయి".

మహారాజు ఒక్కసారిగా డీలాపడిపోయాడు.

"అటులైన ఈ యువకుడు ఇంక మరణించడు కదా. అతని ఊహల్ని బంధించటం మనవల్ల కాదుకదా" అని మరలా మరలా వాపోయాడు.

"అందుకే మహాప్రభూ. అతడి శిరచ్ఛేదనం జరిపించుదాం"

"వీల్లేదు అది మాకు అవమానం. మీరు ఎలా అయినా చేయండి... అతను ఆ విధంగా మరణించవలసిందే. ఇంకే మాత్రం నేను మరోమాట వినదలచుకోలేదు" అని తన ఏకాంత మందిరంలోకి వెళ్ళిపోయాడు మహారాజు.

* * *

మంత్రివర్యులకు యేం చేయాలో అర్థంకాలేదు.

మహారాజు మంచానపడ్డాడు. ఆయన ఆరోగ్యం దెబ్బతింది. వివిధ రకాల వైద్యాలు చేస్తున్నా ఆయనలో మార్పు కనిపించటం లేదు. ఈ విషయం గురించి ఎంత దాయాలన్నా కుదరటం లేదు. వేగులవారికి వార్తలు వెళ్తున్నాయి ఇది ఇలానే కొనసాగితే దేశం ప్రమాదంలో పడుతుంది.

మరేమిటి చెయ్యటం ?

మరోపక్క ఆ యువకుడి శారీరక, మానసిక పరిస్థితి ఆశ్చర్యాన్ని గొలుపుతూంది. మానవజాతిలో ఇదో విడ్డూరం! ఇంతవరకూ ఇలాంటివి వినటమేగాని ప్రత్యక్షంగా చూస్తుంది ఇప్పుడే.

మహారాజు దగ్గరకు వెళ్ళగానే తనకేసి ఆరాటంగా చూస్తాడు. తన పెదవుల నుండి ఆయన ఎదురుచూసే వార్తకోసం ఆయన చెవులు రిక్కిస్తాడు. ఆయన కోర్కె నెరవేరేలోగా ఆయన ఉంటాడా... ?

మహారాజ సేవలో పునీతమైన అమాత్యులవారికి అలాంటి ఆలోచనే భయానకంగా తోచింది. అయినా ఈ సమస్యను పరిష్కరించాలను కున్నాడు. అందుకే అనేకమందితో సమావేశం జరిపాడు.

ఆ తర్వాత ఓ నిర్ణయానికి వచ్చాడు.

*     *     *

"ప్రభూ"

"ఏమిటి అమాత్యా...ఏమైనా విశేషమా?" ఆరాటంగా అడిగాడు మహారాజు.

"విశేషమైతే ఏమీ లేదుగానీ, ఓ విషయమై మీ అనుమతి తీసుకోవటానికి వచ్చాను ప్రభూ"

"ఏ విషయం ?"

"అదే...ఆ యువకుడి విషయమే"

"నా ప్రాణం పోయినా మరో పద్ధతిలో ఆతను మరణించుటకు నేను అంగీకరించను" మొండిగా అన్నాడు.

"మహాప్రభూ...మీ పట్టుదల నాకు తెలియనిదా ... మీ పద్ధతుల్లోనే ఆ యువకుడి మరణ వార్తను అందించగలను. అయితే కొద్దిపాటి సవరణ..."

"ఏమిటది?"

అమాత్యులవారు వివరించారు.

"అంతే మహారాజా ఇంక మీరు కాదనవద్దు. అతి త్వరలోనే ఫలితములు కనిపించగలవు"

మహారాజు మౌనంగా తన అంగీకారం తెలిపారు.

*     *     *

"అమాత్యా"

"ప్రభూ"

"మనం ఆ యువకుడ్ని చూడాలని ఉంది"

"అలానే ప్రభూ"

ఇరువురూ వెళ్ళేసరికి కారాగారంలో... తన గదిలో అట్నూ ఇటూ దొర్లుతున్నాడా యువకుడు.

అతనిలో చాలా మార్పు కనిపించింది.

ఇదివరకటి నాజూకుతనమూ, కాంతీ క్రమంగా తగ్గుముఖం పట్టాయి.

"మహామంత్రీ ఏమిటీ చమత్కారం"

"ఏం లేదు ప్రభూ. మీరు ఊహించిన పద్ధతే. అయితే స్వల్పమైన మార్పు ఆ యువకుడికి ఇదివరకటిలా భోజనం ఇవ్వకుండా ఉండటం కాకుండా రోజంతా ఏదో ఒకటి తింటానికి ఇస్తూనే ఉన్నాం. చిక్కటిపాలూ, మషాళాలు దట్టించిన మాంసాహారం, మత్తెక్కించే ద్రాక్ష సారాయి, మధురమైన తీపి పదార్థాలూ...ఇంకా ఇంకా అతను కోరినవన్నీ ... మరి కొన్ని రోజుల తర్వాత రాకుమార్తె వారిని తీసుకువచ్చినా ఆమె ఇతన్ని అసహ్యించుకుంటుంది ప్రభూ"

ప్రభువు కళ్లు మెరిశాయి.

మరికొద్ది నెలలు గడిచాయి.

అతనిప్పుడు అందమైన యువకుడిలా లేడు. క్రూరమృగంలా ఉన్నాడు. అతని శరీరం ఏమాత్రం అదుపు లేకుండా పెరగటంతో వికృతంగా కనిపిస్తున్నాడు. అతన్ని ఆ విధంగా చూసి మహారాజు పరమానంద భరితుడయ్యాడు.

మరికొన్ని రోజులు గడిచాయి.

ఓ రోజు మహారాజుకు కబురు వచ్చింది.

ఆ యువకుడు మరణించేడు...

రాజు అత్యంత ఆనందంతో ఆ వ్యక్తిని చూశాడు.

అతని దేహం చూసి మహారాజులో గగుర్పాటు కూడా కలిగింది.

అమాత్యుల వారితో ఏకాంతంగా సమావేశమై అడిగాడు.

"అమాత్యా అతని మరణమునకు కారణమేమిటి?"

"ప్రభూ ఒకటి అని చెప్పనవసరం లేదు. ఆ మాటకొస్తే వైద్యులెవరూ ఈ మరణమునకు ఏది కారణమో చెప్పలేకున్నారు. అనేక రోగ

ములతో ఆ శరీరం కృశించిపోయింది. ఈ రోగములన్నింటికీ ఒకే కారణం ప్రభూ"

"ఏమిటది?"

"తిండి ఎక్కువ కావటం"

మహారాజు తెరలు తెరలుగా నవ్వాడు.

* * *

రాజులు పోయారు.

రాజ్యాలు పోయాయి.

ప్రజాస్వామ్యం వచ్చింది.

కొంతమంది ఇప్పటికీ అక్కడా ఇక్కడా "ఆకలి చావులు"న్నా యంటూ గోల చేస్తుంటారు.

అయితే ప్రభువులు ఇందుకు అంగీకరించరు. ఈ ప్రభువులందరిదీ ఈ విషయంలో ఒకటే మాట.

"తిండి లేకుంటే మనిషి చావడు. తిండి ఎక్కువైతేనే మనిషి పోతాడు."

—ఈనాడు ఆదివారం

శ్రీ దామూరు రమేష్ బళ్ళారిచే, కన్నడంలోకి అనువదించబడినది.